

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 261 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 22, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



# గంజాయి మత్తును.. గాలికొదిలేశారు!

- గాండ్రిస్తున్న గంజాయి బ్యాచ్లీలు
- యువతను పాడు చేస్తున్న గంజాయి మత్తు
- సమాజాన్ని అధోగతి పాలు చేస్తుంది
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న గంగజాయి
- చిల్లర అలవాట్ల చెంత చేరుతున్న యువత
- పోలీసులది ఒక్కరిదే బాధ్యత్తతే ఎలా.....మిగతా వ్యవస్థలు ఏం చేస్తున్నట్టు
- ఏం చక్కా గంజాయి వనాలను పెంచుకునే స్థాయికి చేరారు
- గంజాయి మత్తులో ఏం చేస్తున్నారో ఎవరికి అంత చిక్కడం లేదు
- అక్రమంగా నడిపించబడుతున్న వైన్స్ లపై దాడులు ఎక్కడ
- సమాజ బాధ్యతను బోద్దిగా పట్టించుకున్న నాథులులేరు : డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

సమాజాన్ని శాసించినోనిదే రాజ్యమైతే సమసమాజ స్థాపన సాధ్యం ఎలా అవుతుందంటూ డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్కసారిగా వ్యాప్తి చెందుతున్న గంజాయి బ్యాచ్చీలు ఉద్యమ చరిత్ర కలిగిన వరంగల్ సమాజాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని మండిపడ్డారు. ఉన్నతమైన భావాలతో చరిత్ర పుటల్లో నిలిచిన వరంగల్ జిల్లాను ఇంతటి హీనంగాను ఇంతటి దరిద్రంగాను ఇంతటి మసకబారిన తనంగాను మారుస్తున్న గంజాయి మూకలను గంజాయి వ్యసనపరులను అడుగడుగున అడ్డుకోకపోవడం చాలా ప్రమాదకరం అన్నారు. గంజాయి వ్యసనపరులు కేవలం వాళ్ల జీవితాల్లోనే కాకుండా పక్క వాళ్ళ జీవితాలతో పాటు సమాజాన్ని పూర్తిస్తాయిలో ప్రభావితం చేస్తూ నాశనం చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజల మనోభావాలతో పని లేకుండా నవ సమాజ నిర్మాణంతో సంబంధం లేకుండా విచ్చలవిడి గంజాయి వ్యాపకాలతో రెచ్చిపోతున్న చిల్లర బ్యాచ్ లను వెంటాడాల్సిందేనని గట్టిగా చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా చరిత్రపై దాడులు జరుగుతున్నాయని ఒకప్పుడు కవులు, కళాకారులు, ఉద్యమకారులు, మేధావులు, చరిత్రకారులు,రైతన్నలు,కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, దృఢ సంకల్పంతో ఉమ్మడి వరంగల్ జిల్లా కాకతీయ తోరణానికి కళారూపాలను సౌందర్య రూపాలను సాంస్కృతిక సాంప్రదాయ రూపాలను సమాజ నిర్మాణ రూపాలను దృఢంగా ఏర్పరిచి వాళ్ళ నిజాయితీని చాటుకున్నారని గర్వపడ్డారు. నేడు అదే ప్రాంతంలో రాజకీయ లబ్ధి ఆస్తుల సంపాదన పదవుల కొట్లాట రాజకీయాల కక్షలు అసాంఘిక శక్తుల ఆగడాలు అక్రమ సంపాదకుల పోకడలు నిజాయితీపరులు అణిచివేతలు

- మిగతా 2లో..





డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్





## రూ.40 కోట్ల భూమి వృద్ధురాలికే

- భూకబ్జాదారులపై మల్కాజ్‌గిరి సీపీ సుమతి కొరడా
- 80 ఏళ్ల వృద్ధురాలికి అండగా నిలిచిన పోలీసులు
- రాజకీయ ఒత్తిళ్లను లెక్కచేయకుండా విచారణ
- రెవెన్యూ రికార్డులతో భూమి యాజమాన్యంపై స్పష్టత
- కబ్జాకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



2

## రేవంత్ రెడ్డినే టార్గెట్ చేశా: కొండా సుస్మిత

- కాంగ్రెస్ పార్టీపై తనకు ఎలాంటి వ్యతిరేకత లేదన్న సుస్మిత
- సోనియా, రాహుల్, ప్రియాంకలపై గౌరవం ఉందని వెల్లడి
- రేవంత్, ఆయన కుటుంబంపై అవినీతి ఆరోపణలు
- 'టికెట్ నిర్ణయించడానికి సీఎం ఎవరు?' అంటూ ప్రశ్న
- పరకాల నుంచి స్వతంత్రంగానైనా పోటీ చేస్తానని ప్రకటన



2

## పెల్లెట్ గన్ బాధితుడికి న్యాయం చేయాలి

నిరసనకు దిగిన రాహుల గాంధీ



7

## కొండా ఫ్యామిలీపై రేవంత్ సీరియస్

- క్రమశిక్షణ ఉల్లంఘనగా పరిగణించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- కఠిన చర్యలు తప్పవని పార్టీ నేతలకు సీఎం హెచ్చరిక
- మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ
- పరకాల నుంచి పోటీ చేస్తానన్న సుస్మితా పటేల్ ప్రకటనపై దుమారం
- పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే చర్యలు తప్పవని పీసీసీ స్పష్టీకరణ



2

# బోనస్ పొందేందుకు వరి సాగు వివరాలు నమోదు చేసుకోవాలి

**మండల వ్యవసాయ అధికారి అనురాధ**

**హసన్‌పర్తి, 21 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరిని సాగు చేస్తున్న రైతులు బోనస్ ప్రయోజనం పొందేందుకు తమ వరి సాగుకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని హసన్‌పర్తి మండల వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. ప్రభుత్వం సూచించిన సాంబ మసూరి (బీపీటీ 5204), సిద్ధి (డబ్ల్యూజీఎల్ 44), కునారం సన్నాలు (కేఎన్ఎం 1638), హెచ్ఎంటీ, జై శ్రీరామ్, కేఎన్ఎం 7715, తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048) రకాల వరిని సాగు చేస్తున్న రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. డీలర్ వద్ద వరి విత్తనాలు కొనుగోలు చేసిన లేదా కొనుగోలు చేసే రైతులు సంబంధిత డీలర్ పాయింట్ వద్ద తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, సొంత విత్తనాలతో పై రకాల వరిని సాగు చేస్తున్న రైతులు బోనస్ కోసం స్వీయ ధృవీకరణ పత్రాన్ని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు సమర్పించి, అనంతరం వారి ద్వారా సాగు వివరాలను ధృవీకరించుకోవాలని సూచించారు. రైతులు బోనస్ ప్రయోజనం కోల్పోకుండా వరి సాగుకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియను 2026 సెప్టెంబర్ 10వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనురాధ కోరారు.

# ట్రాఫిక్ నియంత్రణకు ఓయసిస్ ఫర్టిలిటీ హాస్పిటల్ సహకారం





**వరంగల్, 21 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ కమిషనరేట్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టేందుకు ఓయసిస్ ఫర్టిలిటీ హాస్పిటల్ స్వచ్ఛందంగా ట్రాఫిక్ పోలీసులకు సహకారం అందించింది. కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగపడే 25 బ్యారికేడ్లు/స్టాపర్లను ఓయసిస్ ఫర్టిలిటీ హాస్పిటల్ యాజమాన్యం స్వచ్ఛందంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసులకు అందజేసింది. ఈ కార్యక్రమం ఏసీపీ ట్రాఫిక్ వరంగల్ టీ. సత్యనారాయణ, కాజీపేట ట్రాఫిక్ సీఐ పీ. వెంకన్న సమక్షంలో జరిగింది. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన బ్యారికేడ్లను అందించి పోలీసులకు సహకరించిన ఓయసిస్ ఫర్టిలిటీ హాస్పిటల్ యాజమాన్యాన్ని ఏసీపీ టీ. సత్యనారాయణ, సీఐ పీ. వెంకన్న అభినందించారు. ప్రజల భద్రత, సౌకర్యం కోసం స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు పోలీసు శాఖకు సహకరించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**నర్సంపేటలో వి.ఎన్.ఆర్., అవని హాస్పిటళ్లలో డీఎంహెచ్ఓ తనిఖీలు**



**వరంగల్, ఆగస్టు 21 (జై భీమ్ న్యూస్)**

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2011, నిబంధనలు - 2022ను ప్రతి ఆసుపత్రి, క్లినిక్, వైద్య సంస్థ తప్పనిసరిగా పాటించాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి సూచించారు. శుక్రవారం డీఐఓ/డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ఐ. ప్రకాష్‌తో కలిసి నర్సంపేటలోని వి.ఎన్.ఆర్. హాస్పిటల్, అవని హాస్పిటల్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను డీఎంహెచ్ఓ పరిశీలించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం అవసరమైన అన్ని రికార్డులు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆసుపత్రి యాజమాన్యాలకు సూచించారు. ప్రతి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేరు చేసి సురక్షితంగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన అన్ని ఫైర్ సేఫ్టీ చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, ఆసుపత్రి సిబ్బంది సురక్షితంగా బయటపడేందుకు తగిన భద్రతా ఏర్పాట్లు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ లేకుండా ఏ ఆసుపత్రి, క్లినిక్ లేదా ఇతర వైద్య సంస్థలను నిర్వహించరాదని డా. రాజారెడ్డి స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్య సంస్థలు నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే తనిఖీలు చేపట్టి, ఉల్లంఘనలకు పాల్పడిన సంస్థలపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టబద్ధమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్ఓ ప్రసన్న కుమార్, ఎల్‌డీ కంప్యూటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# గంజాయి "ముప్పును" గాలికొదిలేసారు

మొదటి పేజీ తరువాయి

అవినీతిపరుల సాహసాలు అన్నిటికి మించి యువత గంజాయి మత్తులో మునిగితేలుతూ రాత్రనకా పగలనకా రోడ్లపై సంచరిస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా చారిత్రాత్మక నిర్మాణాన్ని పాడు చేస్తున్నారని హెచ్చరించారు.యువత బాధ్యతను మరుస్తుండడంతోపాటు దీర్ఘకాలిక లక్ష్యాలను వదిలిపెట్టి స్వల్పమైన ఆనందాల కోసం అల్ప సంతోషాల కోసం ఆరాటపడడమే కాకుండా గంజాయి డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలకు పూర్తిస్థాయిలో అలవాటు పడి ఎక్కడపడితే అక్కడ దుర్బలమైన పరిస్థితులను ఏర్పాటు చేస్తున్నారని హెచ్చరించారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యా ప్రస్థానానికి ఒకింత గర్వముండేదని నేడు విద్యావ్యవస్థలు పూర్తిస్థాయి రాజకీయాల చెప్పుచేతల్లో విద్యాసంస్థలను నడపాల్సిన పరిస్థితిలు ఏర్పడడంతో ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేటు హాస్టల్స్ లలో వసతులు కల్పించుకొని ఉన్నత చదువులకు బదులు ఊహించని జీవితాలను సాగిస్తున్నారని గుర్తు చేశారు.మరి ముఖ్యంగా ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలలో విధినభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటున్న రోజుల్లోనే సహజీవనాలకు అలవాటు పడుతూ కంబైన్డ్ స్టడీస్ కోసం అంటూ ఒకే అద్దె రూములు తీసుకొని జీవిస్తున్నారంటూ తీవ్రంగా హెచ్చరించారు.విద్యార్థుల జీవితాలలో తల్లిదండ్రుల ప్రభావం అనేది పూర్తిగా మసకబారిపోయిందని పూర్తిగా దెబ్బతిన్నదని అందులో భాగంగానే యువత మేజర్లమంటూ స్వేచ్ఛాయుతమైన జీవితాలను జీవించుకునే హక్కు వాళ్లకు ఉందంటూ సమాజంపై వాటిని బలవంతంగా రుద్దడమే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లా సమాజ రూపురేఖల్ని పూర్తిస్థాయిలో మార్చేస్తున్నారని మండిపడ్డారు.వాటికి తోడు లెక్కలేనన్ని స్పా సెంటర్లు, ఓయో రూములు,నడిరోడ్లపై వైన్స్ విచ్చలవిడిగా దాబాలు,లెక్కలేనన్ని రిసార్ట్ సెంటర్స్ యువతను ఆకర్షిస్తూ యువత జీవితాలను పాడుచేస్తూ చారిత్రాత్మకమైన వరంగల్ సమాజాన్ని సమాజం గొప్పతనాన్ని పూర్తిగా నాశనం చేస్తుందని మండిపడ్డారు.పురాతన విద్యాసంస్థలైన ఎన్ఐటి కేఎంసీ కాకతీయ లాంటి ప్రభుత్వ విద్య సంస్థలను,డ్రగ్స్ గంజాయి లాంటి మాదక ద్రవ్యాలు ఉన్నత స్థాయిలో ప్రభావితం చేస్తున్నాయని హెచ్చరించారు.మత్తులో మునిగి తేలుతున్న యువత తరగతి గదులకు హాజరుకాకుండా విద్యకు దూరంగా ఉంటూ విద్యాసంస్థలకు తీరని మచ్చలా తయారవుతున్నారన్నారు.

**వ్యసనాలు...వ్యాపారాలు... విద్యార్థుల జీవితాలపై విచిత్రమైన వెక్కిరింతలు.. నిరుద్యోగభారంపై నిలువు దాడులు**

విద్యార్థులను వ్యసనాలకు అలవాటు పడేలా చేస్తూ విద్యార్థులు అలవాటు పడుతున్న వ్యసనాలను వ్యాపారాలుగా వాడుకోవడానికి సమాజంలో కొంతమంది పేరు కలిగిన వ్యక్తులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.ముఖ్యంగా ఈనెల 11న నల్గొండలో జరిగిన స్కూల్ ప్రిన్సిపాల్ కళ్ళు రూపా రెడ్డిని అత్యంత దారుణంగా హత్య చేసింది పదవ తరగతి చదువుతున్న విద్యార్థులేనని తెలిశాక తెలంగాణ సమాజం ఒక్కసారి నివ్వెరపోయిందన్నారు.పదవ తరగతిలోనే గంజాయికి బానిసై వక్రమార్గంలో డబ్బులు ఎలా సంపాదించాలో సెల్ఫోన్ మాధ్యమాల్లో వీక్షిస్తుండగా వారిని పరీక్షించిన స్కూల్ ప్రిన్సిపల్ పేరెంట్ సమక్షంలో మందలించడంతో కక్షగట్టి వెంటాడి హత్య చేయడమే కాకుండా ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లారని తెలంగాణ రాష్ట్ర మంతా గమనించారన్నారు.తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల పట్ల జరుగుతున్న నిరంకుశమైన దాడులను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు అన్ని ప్రధాన సెంటర్లలో ధర్నాకు దిగడం రాష్ట్ర విద్యా సంస్థను తీవ్రంగా కలవర పెట్టిందన్నారు.లక్షలాది మంది విద్యార్థులు పట్టు బిగించి ఉద్యమాలు చేస్తే ఏ విధంగా ఉంటుందో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పాలిటెక్నిక్ విద్యార్థులు చేసి చూపిస్తున్నారని అన్నారు. హన్మకొండ జిల్లాలోని ములుగు రోడ్డు ప్రాంతంలో పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్డు నిర్బంధిస్తూ నిరసన తెలుపడం తీవ్ర అంతరాయాలను సృష్టించిందన్నారు.ఒకవైపు దేశవ్యాప్తంగా ఉద్యమాలతో హక్కుల కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులు మరోవైపు విద్యా హక్కులతో సంబంధం లేకుండా వ్యసనాలకు అలవాటు పడి సమాజాన్ని పాడు చేస్తున్న యువత మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లాలో నివసిస్తుండగా యువత తీరు పట్ల అధికార యంత్రంగాలు ఏమాత్రం అర్థం చేసుకోకుండా పోవడమే కాకుండా మాకెందుకులే అంటూ చూసి చూడనట్లు వదిలేస్తున్నట్లుగా సమాజంలో నడుస్తున్న యువత తీరు తెలియజేస్తుందన్నారు.యువత నడుస్తున్న మార్గాలను ఎప్పటికప్పుడు పసిగడుతూ కేవలం పోలీస్ శాఖ మాత్రమే మత్తు పదార్థాలకు, మత్తు పానీయాలకు, మాదకద్రవ్యాలకు యువత అలవాటు పడకుండా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను సన్మార్గంలో నడిపించే ప్రయత్నాలు చేస్తున్నారని పోలీస్ శాఖ మినహాయిస్తే ఏ ఒక్క ప్రభుత్వ శాఖ యువత పట్ల బాధ్యతగా వ్యవహరించడం లేదని గుర్తు చేశారు.కొన్నిచోట్ల పోలీస్ శాఖ కూడా పూర్తిగా విఫలమవుతున్నట్లు కనిపిస్తుండగా వైన్స్,డాబాలు,రెస్టారెంట్స్ రిసార్ట్స్,ఓయో రూములకు రాత్రింబగళ్లు సమయపాలన లేకుండా కొనసాగుతుండడం వల్ల యువత మొత్తం దుర్బలమైన జీవితాలకు అలవాటు పడుతున్నారని తీవ్రంగా హెచ్చరించారు.ఈ విధంగా విద్యార్థుల జీవితాలపై చిత్రమైన వెక్కిరింతలతో కూడిన అభియోగాలు పెరిగిపోతుండగా రాష్ట్రంలో నిరుద్యోగ భారంపై విలువైన దాడులు జరుగుతున్నాయని వివరించారు.ఉమ్మడి వరంగల్ ప్రాంతాన్ని రాజకీయ ప్రభావం శాసిస్తున్నంత కాలం వరంగల్ సమాజంలో ప్రధాన ప్రాంతాలన్నీ చరిత్ర పుటలు వీడి అవమాన దాడులు ఎదుర్కొంటున్నాయని వాటన్నిటికీ కారణం దారి తప్పుతున్న యువతేనంటూ తేల్చి చెప్పారు.దేశవ్యాప్తంగా యువత పోరాటాలను ఆదర్శంగా తీసుకోవాల్సిన ఉమ్మడి వరంగల్ జిల్లా యువత వాటిని పెడచెవిన పెడుతూ జల్సా లకు గంజాయికి డ్రగ్స్ కు సైబర్ నేరాలకు అలవాటు పడుతూ వరంగల్ చరిత్రను అవమాన పరుస్తున్నారని వాపోయారు.



# రూ.40 కోట్ల భూమి వృద్ధురాలికే

**భూకబ్జాదారులపై మల్కాజ్‌గిరి సీపీ సుమతి కొరడా**
**80 ఏళ్ల వృద్ధురాలికి అండగా నిలిచిన పోలీసులు**
**రాజకీయ ఒత్తిళ్లను లెక్కచేయకుండా విచారణ**
**రెవెన్యూ రికార్డులతో భూమి యాజమాన్యంపై స్పష్టత**
**కబ్జాకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**హైదరాబాద్, ఆగస్టు 21 (జై భీమ్ న్యూస్) :**

హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 80 ఏళ్ల ఓ వృద్ధురాలు భూకబ్జాదారుల చెర నుంచి తన రూ.40 కోట్ల విలువైన ఆస్తిని దక్కించుకున్నారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ (సీపీ) సుమతి చొరవతో ఆమెకు సకాలంలో న్యాయం చేకూరింది. రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్కచేయకుండా నిందితులపై కఠినంగా వ్యవహరించి, వృద్ధురాలికి బాసటగా నిలిచిన సీపీపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన సదరు మహిళకు సుమారు రూ.40 కోట్ల విలువైన ఖాళీ స్థలం ఉంది. దశాబ్దాలుగా ఆ భూమి ఆమె స్వాధీనంలోనే ఉన్నప్పటికీ, ఇటీవల కొందరు భూకబ్జాదారులు ఆ ఆస్తిపై కన్నేశారు. అక్రమంగా స్థలంలోకి చొరబడి, అది తమదేనంటూ సదరు వృద్ధురాలిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో బాధిత మహిళ ధైర్యంతో మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించారు. తన భూమికి సంబంధించిన అన్ని దస్తావేజులను సమర్పించి, న్యాయం చేయాలని ఆమెను అభ్యర్థించారు. వృద్ధురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన సీపీ సుమతి, సమగ్ర విచారణకు ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, ఆ భూమి బాధితురాలిదేనని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల ద్వారా కబ్జాదారులు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయినప్పటికీ సీపీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, ఆ స్థలం తమదేనని వాదిస్తున్న వారిని పిలిపించి ఆధారాలు సమర్పించాలని ఆదేశించారు. వారు సరైన పత్రాలను చూపలేకపోవడంతో, ఆ భూమి వృద్ధురాలిదేనని అధికారులు తుది నిర్ధారణకు వచ్చారు. కోట్లాది రూపాయల విలువైన తన ఆస్తి తిరిగి దక్కడంతో ఆ వృద్ధురాలు హర్షం వ్యక్తం చేశారు. సీపీ సుమతి ప్రదర్శించిన చొరవను, వృత్తిపరమైన నిబద్ధతను స్థానికులు కొనియాడుతున్నారు. భూకబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# కొండా ఫ్యామిలీపై రేవంత్ సీరియస్

**హైదరాబాద్, ఆగస్టు 21 (జై భీమ్ న్యూస్):**

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ పర్యటన నుంచే ముఖ్య నేతలకు ఆయన గట్టి హెచ్చరికలు పంపినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పరకాలలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తద్వారా రేవూరి అభ్యర్థిత్వాన్ని దాదాపు ఖరారు చేస్తూ స్పష్టమైన సంకేతాలిచ్చారు. అయితే, ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేసేలా.. ఆ మరుసటి రోజే మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ పరకాల నియోజకవర్గంలో సభ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా, వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. సీఎం పర్యటనకు స్థానిక మంత్రిగా ఉన్న కొండా సురేఖ గైర్హాజరు కావడం, ఆ వెంటనే ఆమె కుమార్తె ఈ వ్యాఖ్యలు చేయడం ఒక ప్రణాళిక ప్రకారమే జరిగిందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఈ పరిణామాలపై బుధవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్.. అక్కడే కొందరు ముఖ్య నేతల వద్ద తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మరికొందరు సీనియర్ మంత్రులతో ఫోన్‌లో మాట్లాడి, ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉన్నట్లు చెప్పారని సమాచారం. సీఎం ఆదేశాల మేరకు పీసీసీ క్రమశిక్షణా కమిటీ వెంటనే రంగంలోకి దిగింది. మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని కోరింది. అయితే, "కుమార్తె చేసిన వ్యాఖ్యలకు నేనెలా బాధ్యురాలిని అవుతాను?" అని మంత్రి సురేఖ గురువారం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. "సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఎవరికి వారు పోటీ చేస్తామని ప్రకటించుకోవడం సరికాదు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. మంత్రి సురేఖ వివరణను పరిశీలించాక తదుపరి చర్యలపై అధిష్ఠానం నిర్ణయిస్తుంది" అని స్పష్టం చేశారు.

# రేవంత్ రెడ్డినే టార్గెట్ చేశా: కొండా సుస్మిత

**హైదరాబాద్, ఆగస్టు 21 (జై భీమ్ న్యూస్):**

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు. "సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను. పైగా ఎమ్మెల్యే టికెట్ ఎవరికివ్వాలో నిర్ణయించడానికి ఆయన ఎవరు? సీడబ్ల్యూసీ సమావేశాల వంటి వ్యవస్థ ఉంది కదా. ఆ ప్రకారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారు. నేను అదే ప్రశ్నించాను. నేను స్వతంత్రంగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను" అని కొండా సుస్మిత ఓ జాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమంటూ గీసుకొండలో బుధవారం నాడు సుస్మిత అన్న విషయం తెలిసిందే. ఇటీవల పరకాల బహిరంగ సభలో 'వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అలా ఏకపక్షంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సీఎం సోదరుడు పెట్టిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని.. తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబం అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు.

# ట్రాఫిక్ రద్దీ నివారణకు ఫ్రీ లెఫ్ట్‌ల ఏర్పాటు







**వరంగల్, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తూ వాహనాల రాకపోకలు మరింత సాఫీగా సాగేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ ఎల్అండ్ఓ రాయల ప్రభాకర్, ఏసీపీ ట్రాఫిక్ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ చర్యలు అమలు చేశారు. కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకన్న ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జిడబ్ల్యూఎంసీ) సహకారంతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్ మార్గాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆదాలత్ జంక్షన్‌లో మూడు వైపులా, ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్‌లో ఒక వైపు ఫ్రీ లెఫ్ట్ మార్గాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ఏర్పాట్లలో భాగంగా మొత్తం 54 సిమెంట్ బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఫ్రీ లెఫ్ట్ ద్వారా వెళ్లే వాహనాలు సిగ్నల్ వద్ద ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు అవకాశం కలుగుతుంది. తద్వారా ప్రధాన జంక్షన్ల వద్ద వాహనాల నిలుపుదల, ట్రాఫిక్ రద్దీ కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంతో పాటు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు అవసరమైన ప్రాంతాల్లో ఇలాంటి చర్యలను కొనసాగిస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్ట్ మార్గాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.

# గ్రామాల అభివృద్ధికి.. మంత్రి పొన్నం హామీలు





**ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా పాలన లక్ష్యం**

**గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి కాలువల ద్వారా సాగునీరు అందిస్తాం**

**హన్మకొండ జిల్లా/ భీమదేవరపల్లి, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా పాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలంలోని రసూల్‌పల్లి, చంతయ్యపల్లి గ్రామాల్లో "పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి, సాధ్యమైన వాటికి తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. రసూల్‌పల్లి గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతున్నట్లు అధికారులు వివరించారు. గ్రామంలో 63 మందికి పెన్షన్ల రూపంలో రూ.17.63 లక్షలు, 332 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.2.31 కోట్లు, రైతు భీమా కింద రెండు కుటుంబాలకు రూ.10 లక్షలు అందినట్లు తెలిపారు. ఆరు స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.31.20 లక్షలు, ఎస్.హెచ్.జి బ్యాంక్ లింకేజీ కింద రూ.12 లక్షలు విడుదలయ్యాయని చెప్పారు. 94 కుటుంబాలకు మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ కింద రూ.74,992 లబ్ధి చేకూరిందని, మొదటి దశలో మంజూరైన ఎనిమిది ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. రెండో దశలో మరిన్ని ఇళ్ల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని, గ్రామ ప్రజలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతోందని వివరించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా రసూల్‌పల్లి--వీర్లగడ్డ తండా మార్గంలో లో లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.54 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. రసూల్‌పల్లి గ్రామంలో మరో బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.65 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. రసూల్‌పల్లి--మల్లారం రహదారి అభివృద్ధికి సుమారు రూ.86 లక్షలు మంజూరయ్యాయని, పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అంతర్గత రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి కూడా ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ విధానాల్లో మార్పులు చేసుకోవాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని వృథా చేయకుండా ప్రతి చుక్కను ఒడిసిపట్టేలా జల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీ భవనం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర ప్రభుత్వ భవనాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘాలకు అవసరమైన శిక్షణ, రుణ సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్య సేవలు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలని, గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ, దోమల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం చంతయ్యపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ప్రజల నుంచి వినతులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో 68 పెన్షన్ల ద్వారా రూ.18.8 లక్షలు, 252 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.1.52 కోట్లు, రైతు భీమా కింద ముగ్గురు రైతుల కుటుంబాలకు రూ.15 లక్షలు అందినట్లు అధికారులు తెలిపారు. 14 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, 17 సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.87.69 లక్షలు విడుదలైనట్లు వివరించారు. ఆరు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని, రెండో దశలో మరిన్ని ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. 93 కుటుంబాలకు మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సబ్సిడీ, 52 కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు వెల్లడించారు. చంతయ్యపల్లిలో ఆయిల్‌ఫామ్ సాగును విస్తరించాలని మంత్రి రైతులకు సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, ఆయిల్‌ఫామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. "జల సిరి" పథకం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500, పంట పొలాల్లో ఫామ్ పొండ్లు నిర్మించుకుంటే రూ.1.30 లక్షల వరకు సహాయం అందిస్తుందని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి కాలువల ద్వారా నీరు అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కాలువల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. "గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేయకపోతే నేను ఓట్లు అడగను" అని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. గతంలో మూతపడిన పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైతే నూతన పాఠశాల భవనం నిర్మిస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ నెల 31వ తేదీలోగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చంతయ్యపల్లి గ్రామ అభివృద్ధికి సంబంధించి పలు హామీలను మంత్రి ఇచ్చారు. అంగన్‌వాడీకి నూతన భవనం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చంతయ్యపల్లి స్టేజి నుంచి గ్రామం వరకు రహదారిని నెల రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మహిళా భవనానికి స్థలం అందుబాటులో ఉంటే వెంటనే మంజూరు చేస్తామని, గ్రామ పంచాయతీ భవనంలో ఫ్లోరింగ్, బాత్రూమ్ పనులు చేపడతామని చెప్పారు. ఆలయానికి బోర్ ఏర్పాటు చేయాలన్న వినతిపైనా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, మహిళా సంఘాలు, యువత, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేసి రసూల్‌పల్లి, చంతయ్యపల్లి గ్రామాలను మరింత అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో రసూల్‌పల్లి సర్పంచ్ బోయిని మహేష్, చంతయ్యపల్లి సర్పంచ్ భూక్యా సునీత, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మడికొండ పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సీపీ ఎన్ శ్వేత ఐపీఎస్





**వరంగల్, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ శుక్రవారం సందర్శించారు. శిక్షణ కేంద్రానికి చేరుకున్న సీపీకి అక్కడి పోలీస్ అధికారులు మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ శిక్షణ కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. శిక్షణ కోసం వచ్చే పోలీస్ అధికారులు, సిబ్బందికి కల్పిస్తున్న మౌలిక వసతులు, తరగతి గదులు, శిక్షణకు సంబంధించిన ఇతర సదుపాయాలను ఆమె పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరుపై సంబంధిత పోలీస్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందించేందుకు అవసరమైన వసతులు, సౌకర్యాలపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ పర్యటనలో అదనపు డీసీపీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆర్ఐ సింహచలం శ్రీనివాస్, ఆర్ఎస్ఐ రవితేజతో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం కార్యదర్శితో కలెక్టర్ భేటీ

**నవీన్ కుమార్‌ను కలిసిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హన్మకొండ, 21 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్‌ను హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా వరంగల్, ములుగు జిల్లాల పర్యటనకు వచ్చిన నవీన్ కుమార్ హన్మకొండలోని హరిత కాకతీయకు చేరుకోగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆయనకు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇరువురు చర్చించారు. ఓటర్ల జాబితా సవరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో హన్మకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. వరంగల్, ములుగు జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో పర్యటించనున్న ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి బీఎల్‌వీలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ తహసీల్దార్, ఏఈఆర్ఓ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

## కారులో యువతి మృతదేహం.. ఎల్కతుర్తిలో కలకలం!





**ఎల్కతుర్తి, 21 ఆగస్టు 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. రోడ్డు పక్కన మూడు రోజులుగా పార్కింగ్‌లో ఉన్న కారులో గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు పక్కన అనుమానాస్పదంగా నిలిపి ఉన్న కారులో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కారును పరిశీలించగా అందులో యువతి మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. యువతిని గొంతు నులిమి హత్య చేసి అనంతరం మృతదేహాన్ని కారులో ఉంచి ఎల్కతుర్తికి తీసుకొచ్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను పోలీసులు సేకరించారు. కారు యజమాని, మృతురాలి వివరాలను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. హత్యకు గల కారణాలు, నిందితులు ఎవరు అనే విషయాలపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ అనుమానితుల కదలికలపై ఆరా తీస్తున్నారు. మృతదేహం లభించిన ఘటనతో ఎల్కతుర్తి ప్రాంతంలో తీవ్ర ఆందోళన నెలకొంది. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

## వయోవృద్ధుల సంక్షేమమే మా లక్ష్యం: డాక్టర్ అనితా రెడ్డి

**హన్మకొండ, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**





వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ, జడ్జి రామలింగం, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా పరిషత్ కార్యాలయంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ జడ్జి రామలింగం, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి, డీడబ్ల్యూఓ విశ్వజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల కోసం అమల్లో ఉన్న చట్టాలు, వారి హక్కులు, ప్రభుత్వ పరంగా అందుతున్న రక్షణ, న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. వృద్ధులకు ట్రిబ్యునల్ బెంచ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, తమపై జరిగే వేధింపులు, నిర్లక్ష్యం, ఆస్తి సంబంధిత సమస్యలపై చట్టపరమైన సహాయం పొందవచ్చని వివరించారు. వివిధ వృద్ధాశ్రమాల్లో నివసిస్తున్న వయోవృద్ధులు తాము ఒంటరివారమని, తమకు ఎవరూ లేరని దిగులు చెందాల్సిన అవసరం లేదని, వారికి అండగా నిలిచేందుకు సమాజం, న్యాయ వ్యవస్థ, ప్రభుత్వ యంత్రాంగం ఉన్నాయని అతిథులు భరోసా కల్పించారు. నేటి కాలంలో వయోవృద్ధులను వేధించడం, నిర్లక్ష్యం చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని, అయితే అనేక సందర్భాల్లో బాధితులు తమ సమస్యలను బయటకు చెప్పుకోలేక మౌనంగా బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వయోవృద్ధుల పట్ల కేవలం సానుభూతి చూపడం కాకుండా సహానుభూతితో స్పందించి, అవసరమైన సహాయం అందించాలని కోరారు. వేధింపులకు లేదా నిర్లక్ష్యానికి గురైన వయోవృద్ధులు సలహా, సహాయం, పునరావాసం కోసం 14567 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే పిల్లలకు ఆస్తిని ముందుగానే ఇచ్చేయడం వల్ల తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, తల్లిదండ్రులను వేధించడం లేదా నిర్లక్ష్యం చేయడం చట్టరీత్యా శిక్షార్హమని స్పష్టం చేశారు. వృద్ధుల హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అనంతరం వయోవృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ యుగేందర్, దామోదర్, దేవాచారి, శ్రీనివాస్ రావు, డాక్టర్ ఉష, ఉమతో పాటు పలువురు వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# బకాయి బియ్యం మిల్లర్లపై ఉక్కుపాదం..

### రంగంలోకి గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌కు చెందిన 28 మంది కమాండోలు

**హైద్రాబాద్, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



తెలంగాణలో పౌర సరఫరాల వ్యవస్థను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రభుత్వానికి బియ్యం అప్పగించకుండా బకాయిలు పెట్టుకున్న మిల్లర్లపై కఠిన చర్యలకు రాష్ట్ర సివిల్ సప్లైస్ శాఖ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఎన్ఫోర్స్మెంట్, విజిలెన్స్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 28 మంది అత్యుత్తమ కమాండోలను ప్రత్యేకంగా నియమించింది. బకాయి ఉన్న మిల్లర్లపై క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, అక్రమాలు గుర్తించడం, ప్రభుత్వ ధాన్యం, బియ్యం వ్యవహారాల్లో నిబంధనల ఉల్లంఘనలను అడ్డుకోవడం ఈ ప్రత్యేక బృందాల ప్రధాన బాధ్యతగా ఉండనుంది. సివిల్ సప్లైస్ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్ శుక్రవారం ఉదయం సివిల్ సప్లైస్ భవన్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా విధుల్లో చేరిన కమాండోలకు స్వాగతం పలికి, వారికి అప్పగించిన బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. పౌర సరఫరాల శాఖకు సంబంధించిన విధానాలు, నిబంధనలు కొత్తగా చేరిన పోలీసులకు పరిచయం కావడంతో ఇప్పటికే మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందించినట్లు కమిషనర్ తెలిపారు. నిత్యావసర వస్తువులు, పౌర సరఫరాల చట్టాలు, సంబంధిత నిబంధనలపై తెలంగాణ పోలీస్ అకాడమీలో వారికి ప్రత్యేక అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా శాఖ కార్యకలాపాలు, విస్తృతిని కమిషనర్ వారికి వివరించారు. ముఖ్యంగా కేఎంఎస్ 2025-26 సీజన్‌లో రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 154 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించినట్లు తెలిపారు. రైతులకు మద్దతుగా వడ్ల కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యం రూపంలో తిరిగి అందించడం మిల్లర్ల బాధ్యత అని, ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ వంటి ప్రత్యేక పోలీసు విభాగాల్లో పనిచేసిన కమాండోలకు ఆకస్మిక తనిఖీలు, క్షేత్రస్థాయి తనిఖీలు, నిబంధనల అమలులో ప్రత్యేక అనుభవం ఉంది. ఈ నైపుణ్యాలను ఇకపై సివిల్ సప్లైస్ ఎన్ఫోర్స్మెంట్, విజిలెన్స్ విభాగం సమర్థంగా వినియోగించుకోనుంది. కొత్తగా నియమితులైన 28 మంది కమాండోలు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలుగా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్ల వద్ద తనిఖీలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వానికి బియ్యం అప్పగించడంలో బకాయిలు ఉన్న మిల్లర్లపై దృష్టి సారించనున్నారు. బకాయి మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యం, బియ్యం నిల్వలు, రికార్డులు, లెక్కలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యం విషయంలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలను అధికారులు పరిశీలించనున్నారు. అవసరమైన సందర్భాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలని శాఖ నిర్ణయించింది. ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించడం, ధాన్యం లేదా బియ్యం విషయంలో అక్రమాలకు పాల్పడటం, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన మిల్లర్లపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలు, ప్రభుత్వ ధాన్యం రక్షణ, పౌర సరఫరాల వ్యవస్థ పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఫోర్స్మెంట్ చర్యలను మరింత ముమ్మరం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఎల్కతుర్తిలో కారు డిక్కీలో యువతి మృతదేహం

**వరంగల్, 21 ఆగస్టు 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**








హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కారులో యువతి మృతదేహం లభించడం కలకలం రేపింది. మృతురాలిని పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సెంటినరీ కాలనీకి చెందిన అంకిటి మానస (33)గా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా ఆమె వివరాలను నిర్ధారించినట్లు సమాచారం. పోలీసులు గుర్తించిన వివరాల ప్రకారం, వినోద్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కారును అద్దెకు తీసుకున్నట్లు తెలిసింది. కరీంనగర్‌లోని ఓ గదిలో ఉన్న సమయంలో మానసకు ఫిట్స్ వచ్చి మృతి చెందిందని, భయంతో మృతదేహాన్ని కారులో వదిలి వెళ్లినట్లు వినోద్ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు సమాచారం. అయితే ఈ వాదనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. మానస మృతి సహజంగానే జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా? అన్నది ప్రస్తుతం కీలకంగా మారింది. మానస కరీంనగర్‌లోనే మృతి చెందితే మృతదేహాన్ని ఎల్కతుర్తికి ఎందుకు తీసుకువచ్చారు? కారులో ఎందుకు వదిలివెళ్లారు? మృతదేహాన్ని కాల్చే ప్రయత్నం ఎందుకు జరిగింది? మృతురాలి మృతికి ముందు ఆమెతో ఎవరు ఉన్నారు? ఘటనలో వినోద్ ఒక్కడే ఉన్నాడా? మరెవరైనా ప్రమేయం ఉందా? అనే అనేక ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. మృతదేహం కాలిపోయిన స్థితిలో లభించడంతో కేసుపై అనుమానాలు మరింత పెరిగాయి. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర ఆధారాల ఆధారంగా మృతికి గల అసలు కారణాన్ని నిర్ధారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఘటనపై సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. డీసీపీ ఘటనా స్థలాన్ని పరిశీలించి పరిస్థితులను సమీక్షించారు. సీఐ పులి రమేష్, ఎస్ఐ నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఎల్కతుర్తి గ్రామపంచాయతీ కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, మృతురాలి మరణానికి గల కారణాలు, మృతదేహాన్ని తరలించిన పరిస్థితులు, కాల్చే ప్రయత్నం వెనుక ఉద్దేశం, ఘటనలో ఇతరుల ప్రమేయం తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఈ కేసును ఐపీసీ 302, 201 సెక్షన్ల కింద నమోదు చేసినట్లు తెలిపారు. మానస మృతికి దారితీసిన అసలు కారణం ఏమిటి? ఆమె మృతి కరీంనగర్‌లోనే జరిగిందా? మృతదేహాన్ని ఎల్కతుర్తికి ఎందుకు తరలించారు? మృతదేహాన్ని కాల్చే ప్రయత్నం ఎందుకు చేశారు? ఈ ఘటన వెనుక మరెవరైనా ఉన్నారా? అనే ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ ఘటన ఎల్కతుర్తి ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## కేయూ కార్యశాలలో క్యూఎస్ఏఆర్ విశ్లేషణపై పరిశోధకులకు శిక్షణ

**హన్మకొండ, 21 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ అండ్ అలైడ్ డిసిప్లిన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యశాలలో భాగంగా ఐదవ రోజు పరిశోధకులకు ఆధునిక ఔషధ పరిశోధనలో కీలకమైన క్యూఎస్ఏఆర్ (క్వాంటిటేటివ్ స్ట్రక్చర్--యాక్టివిటీ రిలేషన్‌షిప్) విశ్లేషణపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సెంటర్ సంచాలకులు ఆచార్య ఎన్. ప్రసాద్, అదనపు సంచాలకులు డా. టి. శాస్త్రి సారథ్యంలో కొనసాగుతున్న ఈ కార్యశాలకు పూణేకు చెందిన అడ్వెంట్ ఇన్ఫర్మాటిక్స్ లిమిటెడ్ ప్రతినిధులు డా. దీపక్ శర్మ, డా. నచికేత్ జోషి రిసోర్స్ పర్సన్స్‌గా హాజరై పరిశోధకులకు క్యూఎస్ఏఆర్ విశ్లేషణపై ఇంటరాక్టివ్ పద్ధతిలో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ద్విమితీయ క్యూఎస్ఏఆర్, త్రిమితీయ క్యూఎస్ఏఆర్ నమూనాల రూపకల్పనతో పాటు ఫీల్డ్ ఆధారిత క్యూఎస్ఏఆర్ సాంకేతికతలపై నిపుణులు అవగాహన కల్పించారు. క్యూఎస్ఏఆర్ విశ్లేషణ ద్వారా నూతన ఔషధ మాలిక్యూల్స్ రూపకల్పన, కొత్త మాలిక్యూల్స్ లక్షణాలను గుర్తించడం, వాటి జీవక్రియాత్మక ప్రభావాలను అంచనా వేయడం వంటి అంశాలను వివరించారు. అలాగే క్యూఎస్ఏఆర్ విశ్లేషణలో ఉపయోగించే వివిధ డిస్క్రిప్టర్లు, అంచనా నమూనాల నిర్మాణం, వాటి వినియోగ విధానాలను నిపుణులు పరిశోధకులకు వివరించారు. నూతన ఔషధ అణువుల అభివృద్ధితో పాటు ఆధునిక ఔషధ పరిశోధనలో క్యూఎస్ఏఆర్ ప్రిడిక్షన్ మోడల్స్ కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక కంప్యూటర్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఔషధ పరిశోధనలో సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పరిశోధన ప్రక్రియను మరింత వేగవంతంగా, కచ్చితత్వంతో ముందుకు తీసుకెళ్లవచ్చని నిపుణులు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం పరిశోధకులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. కాగా, కార్యశాల ముగింపు సమావేశం ఆగస్టు 22న ఉదయం కాకతీయ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సెంటర్ సంచాలకులు ఆచార్య ఎన్. ప్రసాద్, అదనపు సంచాలకులు డా. టి. శాస్త్రి తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం హాజరుకానున్నారు.



# వికసిత్ భారత్-2047 సాధనలో అకౌంటింగ్, ఫైనాన్స్ కీలకం

### కాకతీయ విశ్వవిద్యాలయంలో నేడు ఒకరోజు సదస్సు

**హన్మకొండ, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో అకౌంటింగ్, ఫైనాన్స్ రంగాల పాత్రను చర్చించేందుకు ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ (ఐఏఏ) వరంగల్ శాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు సదస్సు నిర్వహించనున్నారు. 'వికసిత్ భారత్--2047 సాధనకు ఉత్ప్రేరకాలుగా అకౌంటింగ్, ఫైనాన్స్' అనే అంశంపై ఆగస్టు 22న కళాశాల సెమినార్ హాల్‌లో సదస్సు జరుగుతుందని కన్వీనర్ ఆచార్య పి. అమరావేణి తెలిపారు. సదస్సు ప్రారంభ సమావేశానికి కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఆచార్య గాబ్రియేల్ సైమన్ తాట్టిల్, కార్యదర్శి ఆచార్య సంజయ్ భాయని విశిష్ట అతిథులుగా పాల్గొంటారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎల్‌పీ కన్సల్టింగ్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్, చార్టర్డ్ అకౌంటెంట్ రాధాకృష్ణ కొమరగిరి కీలక ఉపన్యాసం చేయనున్నారు. ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు ఆచార్య కే.వి. అచలపతి, ఆచార్య వి. అప్పారావు, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు ఆచార్య పి. వరలక్ష్మి, ఐఏఏ వరంగల్ శాఖ అధ్యక్షుడు ఆచార్య సి.హెచ్. రాజేశం, కార్యదర్శి ఆచార్య రాజేందర్ కట్ల గౌరవ అతిథులుగా హాజరవుతారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. నరసింహాచారి అధ్యక్షతన ప్రారంభ సమావేశం జరగనుంది. సదస్సులో రెండు సాంకేతిక సమావేశాలు నిర్వహించనున్నారు.




అకౌంటింగ్, ఫైనాన్స్ రంగాల్లో వస్తున్న ఆధునిక మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నూతన ఆవిష్కరణలు, దేశ ఆర్థికాభివృద్ధిలో వాటి పాత్ర, వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనకు అకౌంటింగ్, ఆర్థిక రంగాలు అందించగల సహకారం తదితర అంశాలపై నిపుణులు చర్చించనున్నారు. ముఖ్యంగా సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ, పారదర్శకమైన అకౌంటింగ్ విధానాలు, ఆధునిక ఆర్థిక వ్యూహాలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత ఆర్థిక వ్యవస్థలపై సదస్సులో విస్తృతంగా చర్చ జరగనుంది. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో అకౌంటింగ్, ఫైనాన్స్ రంగాలు పోషించాల్సిన పాత్రను నిపుణులు వివరించనున్నారు. సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ముఖ్య అతిథిగా, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి విశిష్ట అతిథిగా హాజరవుతారు. యూజీసీ యూనిట్ సమన్వయ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జునరెడ్డి, ఐఏఏ వరంగల్ శాఖ అధ్యక్షుడు ఆచార్య సి.హెచ్. రాజేశం, కార్యదర్శి ఆచార్య రాజేందర్ కట్ల గౌరవ అతిథులుగా పాల్గొంటారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. నరసింహాచారి అధ్యక్షతన ముగింపు సమావేశం జరుగుతుందని కన్వీనర్ ఆచార్య పి. అమరావేణి తెలిపారు. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ, పారదర్శక అకౌంటింగ్ విధానాలు, ఆధునిక ఆర్థిక వ్యూహాల ప్రాధాన్యతను చర్చించేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలవనుంది.

## వెనుకబడిన తరగతుల మహిళలకు కుట్టు మిషన్లు.. సెప్టెంబర్ 13 వరకు దరఖాస్తులు



**హన్మకొండ, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో నివసిస్తున్న వెనుకబడిన తరగతుల (బీసీ) మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. అర్హులైన మహిళలు ఈ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుట్టు మిషన్ల కోసం ట్రీజూ:॥/స్త్రశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని, దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 13, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పథకానికి 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బీసీ మహిళలు అర్హులు. నిరుద్యోగ మహిళలు, పేదలు, నిరాదరణకు గురైన మహిళలు, ఒంటరి మహిళలు, వికలాంగులు, అనాథ మహిళలు, అలాగే టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దరఖాస్తుదారులు తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలి. కనీసం 5వ తరగతి ఉత్తీర్ణత కూడా అవసరం. అదేవిధంగా ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలని అధికారులు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్ స్వయం ఉపాధి పథకం ద్వారా లబ్ధి పొందిన వారు ఈ పథకానికి అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేసి కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన మహిళలు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రముఖ న్యాయవాది చీర భరత్‌కుమార్‌కు మదర్ థెరిసా అవార్డు



**వరంగల్, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

సామాజిక సేవతో పాటు జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కరీమాబాద్ 40వ డివిజన్‌కు చెందిన చీర భరత్‌కుమార్‌కు మదర్ థెరిసా అవార్డు ప్రకటించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ తన కలం ద్వారా అనేక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రజలను చైతన్యవంతం చేస్తున్నందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, సంబంధిత శాఖల దృష్టికి ప్రజా సమస్యలను వార్తా కథనాల రూపంలో తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్న భరత్‌కుమార్ సేవలను నిర్వాహకులు అభినందించారు. సామాజిక బాధ్యతతో జర్నలిజాన్ని కొనసాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సౌజన్యంతో సకల కళా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని మదర్ థెరిసా, మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవ సంబరాలు--2026 నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చీర భరత్‌కుమార్‌కు మదర్ థెరిసా అవార్డును అందజేయనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు గడ్డం సుధాకర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం ఆగస్టు 22, 2026న సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వరంగల్ జిల్లా శాంతినగర్‌లోని రాజశ్రీ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సామాజిక సేవ, జర్నలిజం రంగాల్లో భరత్‌కుమార్ చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## ఉయ్యూరులో డయేరియా లేదు

### ఆస్పత్రిని సందర్శించిన మంత్రి నారాయణ

**విజయవాడ,ఆగస్ట్21(జై భీమ్ న్యూస్) :**

ఉయ్యూరులో డయేరియాపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారంటూ మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ మండిపడ్డారు. శుక్రవారం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయేరియా బాధితులను ఆయన పరామర్శించారు. అలాగే స్థానిక 5వ వార్డులో డయేరియా సోకిన ప్రాంత ప్రజలతో ఆయన మాట్లాడి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో 9 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఉయ్యూరుతో పాటు పరిసర గ్రామాల్లో మొత్తం 11 మంది డయేరియాతో ఆసుపత్రిలో చేరారని వివరించారు. కేవలం ఆరుగురు మాత్రమే ఉయ్యూరు మున్సిపాల్టీ పరిధిలో ఉన్నారని పేర్కొన్నారు. వీరందరి ఆరోగ్యం నిలకడగా ఉందని స్పష్టం చేశారు. అయితే ఓ వ్యక్తి ఆగస్టు 17వ తేదీన గుండెపోటు సమస్యతో ఆసుపత్రిలో చేరి మృతి చెందారని మంత్రి నారాయణ తెలిపారు. ఆ వ్యక్తి మృతికి, డయేరియాకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేసే నీటి లైన్‌కు, ఇతర గ్రామాల్లోని నీటి సరఫరా లైన్లకు సంబంధం లేదని వివరించారు. డయేరియాకు కారణం మున్సిపల్ పైప్ లైన్ కాలుష్యమా?.. లేక ఆర్వో ఎ÷-లాంట్ల సమస్యా? అనేది తేలాల్సి ఉందని అన్నారు. ప్రాథమిక పరీక్షల ప్రకారం తాగు నీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేదని తేలిందని మంత్రి నారాయణ వివరించారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లోని పాత పైప్‌లైన్లను మారిస్తున్నామని చెప్పారు. ఉయ్యూరుకు రూ. 98 కోట్లతో అమృత్ 2.0 కింద పనులు చేపడుతున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. మంత్రి నారాయణ వెంట ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్, జేసీ నవీన్ ఉన్నారు.

## పాలిటెక్నిక్ జీఓ నంబర్ 97ను వెనక్కి తీసుకోవాలి: పీడీఎస్‌యూ







**వరంగల్, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 97ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జీఓను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ఐటీఐ కళాశాల నుంచి ములుగు రోడ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం జంక్షన్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల ఫీజుల భారం పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులను కేవలం కార్పొరేట్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందే కార్మికులుగా తీర్చిదిద్దే విధానం సరికాదని వారు విమర్శించారు. టాటా, మహీంద్రా, టయోటా, అశోక్ లేలాండ్ వంటి తయారీ రంగ సంస్థలకు అవసరమైన మానవ వనరులను తయారు చేయడానికే విద్యా వ్యవస్థను పరిమితం చేయకుండా, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, ఉన్నత విద్య, ఉద్యోగ, పరిశోధనా అవకాశాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా విధానాలను రూపొందించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సభ్యులు వంగేటి మోహన్, ఫర్హాన్, నాయకులు మహేందర్, అఖిల్, సురేష్, లక్ష్మణ్, స్వరాజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కడప ఎంపి అవినాశ్ రెడ్డి ఇంట్లో 24 లక్షలు సీజ్

కడప,ఆగస్ట్21(జై భీమ్ న్యూస్): కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నివాసంలో లెక్క చూపని రూ.24 లక్షలు సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం అధికారిక ప్రకటన చేసింది. ఎంపీ నివాసంలో రెండు బ్యాంక్ లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. నెల రోజుల ముందే వివేకా హత్యకు కుట్ర జరిగిందని దస్తగిరి వెల్లడించారని గుర్తు చేసింది. హత్య కోసం దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి రూ.40 కోట్లు ఆఫర్ చేశారని పేర్కొంది. రూ.40 కోట్లలో వాటాగా రూ.5 కోట్లు.. దస్తగిరికి ఇస్తానని ఎర్ర గంగిరెడ్డి ప్రలోభపెట్టారని ఈడీ చెప్పింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్లు ఆధారంగా ఇఅఎఖీ నమోదు చేసినట్లు తెలిపింది. కేసు నమోదు చేశామని ఈడీ వివరించింది. ఈ సోదాల్లో నేరానికి సంబంధించిన.. కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ పరికరాలు సీజ్ చేశామని ఈడీ స్పష్టం చేసింది. హైదరాబాద్, కడప నగరాల్లోని మొత్తం ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు ఈడీ వివరించింది.

## పట్టుపరిశ్రమతో రైతులకు అధిక ఆదాయం

### శాస్త్రీయ పద్ధతులతో పట్టుపురుగుల పెంపకంపై అవగాహన



**హన్మకొండ, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

కేంద్ర పట్టుపరిశ్రమ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మేరాశక్తి--మేరా అభిమాన్ 2.0" కార్యక్రమంలో భాగంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల పట్టుపరిశ్రమ శాఖ సమన్వయంతో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు జిల్లాలకు చెందిన సుమారు 100 మంది పట్టురైతులు పాల్గొన్నారు. పట్టు పరిశ్రమను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు పట్టుపురుగుల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశాలపై అధికారులు అవగాహన కల్పించారు. పట్టుపరిశ్రమకు సంబంధించిన నూతన విధానాలు, అధిక దిగుబడినిచ్చే మల్బరీ రకాలు, మల్బరీ తోటల నిర్వహణ, యాంత్రీకరణ, శాస్త్రీయ పద్ధతుల్లో పట్టుపురుగుల పెంపకం, సమగ్ర పురుగు--వ్యాధుల నియంత్రణ తదితర అంశాలను వివరించారు. రైతులు నాణ్యమైన పట్టుగూళ్లను ఉత్పత్తి చేసేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. అలాగే పట్టుపురుగుల పెంపకంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, ఉత్పాదకతను పెంచడం, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై సూచనలు చేశారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పట్టుపరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు ఉందని అధికారులు తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు శాఖాపరంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పట్టురైతులకు నిరంతరం సాంకేతిక సహకారం, శిక్షణ అందించడంతో పాటు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పట్టుపరిశ్రమ పరిశోధనా సంస్థలకు చెందిన సీఎస్‌బీ--సీఎస్ఆర్‌టీఐ, సీఎస్‌బీ--ఆర్ఎస్ఆర్ఎస్ శాస్త్రవేత్తలు, భువన, హనుమకొండ జాయింట్ డైరెక్టర్ శ్రీమతి అనురాధ, వరంగల్ పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు తిరుపతిరెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు పాల్గొన్నారు. పట్టురైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించి నాణ్యమైన పట్టుగూళ్లను ఉత్పత్తి చేయడంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అధికారులు సూచించారు.

## హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

### జీవిత ఖైదును రద్దు చేసిన సుప్రం కోర్టు

న్యూఢిల్లీ,ఆగస్ట్21(జై భీమ్ న్యూస్):హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్డ జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది. తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

# మహనీయుని ప్రాంగణంలో రాజకీయాలకు తావులేదు

**పార్టీ జెండాలు, చిహ్నాలు తక్షణమే తొలగించాలి**

**బహుజన మహనీయుల ఉత్సవ కమిటీ మండల ప్రధాన కార్యదర్శి బొంకూరి కార్తీక్**



**ఎల్కతుర్తి, 21 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ ప్రాంగణాన్ని రాజకీయాలకు పూర్తిగా అతీతంగా ఉంచాలని బహుజన మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవాల కమిటీ మండల ప్రధాన కార్యదర్శి బొంకూరి కార్తీక్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం చేసిన మహోన్నత కృషికి ప్రతీకగా ఉన్న అంబేద్కర్ ప్రాంగణాన్ని ఏ రాజకీయ పార్టీ కార్యక్రమాలకు వేదికగా ఉపయోగించరాదని ఆయన స్పష్టం చేశారు. అంబేద్కర్ సర్కిల్ ప్రాంగణంలో ప్రస్తుతం ఏదైనా రాజకీయ పార్టీకి సంబంధించిన జెండాలు, పార్టీ చిహ్నాలు, బ్యానర్లు, పోస్టర్లు లేదా ఇతర రాజకీయ గుర్తులు ఉంటే వాటిని తక్షణమే తొలగించాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులను కార్తీక్ కోరారు. గతంలో జరిగిన పార్టీ కార్యక్రమాలు, సమావేశాలు, జెండాల ఏర్పాటు వంటి అంశాలను ఇప్పటివరకు జరిగినవిగా భావించి వదిలేస్తున్నామని, అయితే ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అంబేద్కర్ సర్కిల్‌లో ఇకపై ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన జెండాలు ఏర్పాటు చేయడం, పార్టీ సమావేశాలు నిర్వహించడం, రాజకీయ కార్యక్రమాలు చేపట్టడం, పార్టీ ప్రచారానికి సంబంధించిన బ్యానర్లు లేదా పోస్టర్లు ఏర్పాటు చేయడం చేయవద్దని ఆయన కోరారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రాంగణాన్ని రాజకీయ కార్యకలాపాలకు ఉపయోగిస్తే సంబంధిత పార్టీ మండల నాయకుడే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ విలువలు దేశానికి మార్గదర్శకాలని, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని బొంకూరి కార్తీక్ అన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహం ఉన్న ప్రాంగణాన్ని రాజకీయ వివాదాలకు, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అంబేద్కర్ సర్కిల్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి చెందినది కాదని, మహనీయుల గౌరవానికి ప్రతీకగా ఉన్న ప్రజా ప్రాంగణమని ఆయన స్పష్టం చేశారు. మహనీయుల విగ్రహాల వద్ద వారి ఆశయాలను గౌరవించే వాతావరణం ఉండాలని, రాజకీయ పార్టీల జెండాలు, చిహ్నాలతో ప్రాంగణం నిండిపోవడం వల్ల మహనీయుల గౌరవానికి భంగం కలిగే అవకాశం ఉందన్నారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఈ విషయాన్ని అర్థం చేసుకుని అంబేద్కర్ ప్రాంగణ పవిత్రతను, గౌరవాన్ని కాపాడేందుకు సహకరించాలని బహుజన మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవాల కమిటీ తరఫున బొంకూరి కార్తీక్ విజ్ఞప్తి చేశారు.

# మట్టి, ఇసుక లభ్యత కోసం సులభతర విధానం రూపొందించాలి

**జిల్లాలో విధివిధానాలపై కమిటీ ఏర్పాటు**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హన్మకొండ, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన మట్టి, ఇసుకను సులభతర విధానంలో అందుబాటులోకి తీసుకురావడానికి సమగ్ర విధివిధానాలను రూపొందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో జిల్లా శాండ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఖనిజ వనరులకు సంబంధించిన పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మట్టి (సిల్ట్)ను సులభతర విధానంలో సరఫరా చేసేందుకు, గృహ అవసరాలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వినియోగించుకునేలా విధివిధానాలను రూపొందించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మట్టి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అక్రమ ఇసుక, మట్టి రవాణాను అరికట్టేందుకు సమర్థవంతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పోలీస్, రవాణా, రెవెన్యూ, మైనింగ్, భూగర్భ జలవనరుల శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో మట్టి ధరను ఒక ఘనపు మీటరుకు రూ.150గా, మూడు క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగిన ఒక్క ట్రాక్టర్‌కు రూ.450గా నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించడంతో పాటు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ఆధ్వర్యంలో సులభతరమైన వెబ్‌సైట్ రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పట్టాదారు తన భూమిని చదును చేసుకోవాలనుకుంటే వెబ్‌సైట్‌లో సంబంధిత వివరాలను నమోదు చేసి నిరభ్యంతర పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో మట్టి రవాణా చేసే వాహనాలన్నీ అవసరమైన అనుమతులతో సీజీజీ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామాల్లోని చెరువుల నుంచి రైతులు తమ పంట పొలాలకు వినియోగించుకునేందుకు, అలాగే ఇటుక బట్టీల అవసరాల కోసం సిల్ట్‌ను తీసుకునేందుకు సాగునీటి పారుదల శాఖ నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలని తెలిపారు. గ్రామ పాలన అధికారుల సహకారంతో ఈ విధానాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మట్టి, ఇసుక లభ్యతను సులభతరం చేసేందుకు జిల్లా స్థాయి కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా మైనింగ్ శాఖ ఏడీ రామాచారి, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, భూగర్భ జలవనరుల శాఖ అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ రవీందర్, టీజీఎండీసీ పీఓ వెంకటేశ్వర్లు, సాగునీటి పారుదల శాఖ ఈఈ సునీత, డీఈ రమాకాంత్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సుభాష్, మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రమేష్, పరకాల డీఏవో విజయశ్రీ, ఆర్డబ్ల్యూఎస్ డీఈ మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిజం... నేటి నైజం - మానవ సంబంధాలపై పెరుగుతున్న నిర్లక్ష్యం

**విజయవాడ, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

మారుతున్న కాలంతో పాటు మనిషి జీవన విధానంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ, అదే సమయంలో మానవ సంబంధాలు, ఆప్యాయతలు, కుటుంబ విలువలు, పరస్పర గౌరవం క్రమంగా తగ్గిపోతున్నాయని సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునికత పేరుతో సౌకర్యాలు పెరిగినా, మనుషుల మధ్య ఉండాల్సిన అనుబంధం, ఆత్మీయత మాత్రం తగ్గిపోవడం ఆందోళన కలిగించే పరిణామమన్నారు. ఒకప్పుడు ఇంటికి ఎవరైనా అతిథిగా వస్తే కుటుంబ సభ్యులంతా ఆప్యాయంగా పలకరించి, భోజనం పెట్టి, యోగక్షేమాలు తెలుసుకుని, ఎంతో గౌరవంగా చూసుకునే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆతిథ్య మర్యాదలు క్రమంగా సన్నగిల్లుతున్నాయని, సొంత బంధువుల కంటే పరిచయస్తులకు ‘ఆంటీ’, ‘అంకుల్’ అంటూ పిలిచే సంస్కృతి పెరుగుతోందని అన్నారు. బంధుత్వానికి ఉన్న విలువ కంటే పరిచయానికి, అవసరానికి ఎక్కువ ప్రాధాన్యత లభిస్తున్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఇంటి పనులను సులభతరం చేసేందుకు ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయని, మనిషి శ్రమ తగ్గిందని తెలిపారు. అయితే సాంకేతికత మనిషికి సౌకర్యాన్ని అందించినప్పటికీ, మనుషుల మధ్య ఉండాల్సిన అనుబంధాన్ని మాత్రం భర్తీ చేయలేదని అన్నారు. ఇంట్లో అందరూ ఒకే చోట ఉన్నా, ఒక్కొక్కరు ఒక్కో ప్రపంచంలో జీవిస్తున్నట్టుగా పరిస్థితి మారిందని పేర్కొన్నారు. ఆర్థిక లావాదేవీలు, ఆస్తులు, హోదాలు, వ్యక్తిగత ప్రయోజనాలు కుటుంబ సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయని డా. ఇమ్మానుయేల్ అన్నారు. చిన్నచిన్న అభిప్రాయ భేదాలు పెద్ద సమస్యలుగా మారి బంధువులు ఒకరికొకరు దూరమవుతున్నారని, ఒకప్పుడు కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన బంధుత్వాలు ఇప్పుడు అవసరాలకే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. “ఈక్వేషన్స్ సరిపోక బంధువులంతా దూరమయ్యే పరిస్థితి రావడం సమాజంలో పెరుగుతున్న స్వార్థానికి నిదర్శనం” అన్నారు. అదేవిధంగా అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతున్న పరిస్థితులు కూడా సమాజాన్ని కలవరపెడుతున్నాయని తెలిపారు. జీవిత విలువను గుర్తించకుండా ఒత్తిళ్లు, ఆందోళనలు, అలవాట్లు, నిర్లక్ష్యాలతో కొందరు తమ జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని అన్నారు.



కుటుంబ సభ్యులు ఒకరినొకరు అర్థం చేసుకోవడం, ఆప్యాయంగా మాట్లాడుకోవడం, కష్టాల్లో అండగా నిలవడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చని సూచించారు. తల్లిదండ్రుల పట్ల పిల్లల బాధ్యత కూడా తగ్గిపోతున్నదని డా. ఇమ్మానుయేల్ ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ప్రేమ, త్యాగాలను గుర్తించి “మీ కోసం ఏం చేయాలి? చెప్పండి..” అని అడిగే పిల్లల సంఖ్య తగ్గిపోతుండగా, తల్లిదండ్రులను ఎదిరించే, వారి మాటను పట్టించుకోని పిల్లలు పెరుగుతున్నారని అన్నారు. పిల్లలకు ఆస్తులు, డబ్బు ఇవ్వడం కంటే విలువలు, బాధ్యత, మానవత్వం నేర్పించడం ముఖ్యమని సూచించారు. సమాజంలో ఎక్కడ చూసినా దోపిడీ, దౌర్జన్యం, మోసం పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎదుటివారి పరిస్థితులను అర్థం చేసుకోకుండా తమ ప్రయోజనాల కోసం ఇతరులను ఉపయోగించుకోవడం పెరిగిందన్నారు. మానవత్వం కంటే ధనం, మనిషి విలువ కంటే ఆస్తి, ప్రేమ కంటే ప్రయోజనం ముఖ్యమవుతున్న పరిస్థితి సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు. మద్యపానం కూడా కొందరి జీవితాల్లో వ్యసనంగా మారడమే కాకుండా ఫ్యాషన్‌గా భావించే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. మద్యం సేవించి విచక్షణ కోల్పోవడం, కుటుంబ సమస్యలకు కారణమవడం, రోడ్డు ప్రమాదాలకు గురికావడం వంటి పరిణామాలు అనేక కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని తెలిపారు. యువత మద్యపానం, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అదేవిధంగా రోడ్లపై వాహనాలను అతివేగంగా నడపడం పట్ల కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. “ఓరి వీరి కడుపు మాడా.. ఏమిటా బండి స్పీడు?” అనే పరిస్థితి నెలకొంటోందని, కొద్దిపాటి నిర్లక్ష్యం కారణంగా విలువైన ప్రాణాలు పోతున్నాయని అన్నారు. వేగం కంటే ప్రాణం విలువైనదని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో “కళ్లకు తలకెక్కాయి.. మంచి మర్యాదలు ఎప్పుడో మంట కలిసిపోయాయి” అన్నట్టుగా పరిస్థితులు మారుతున్నాయని డా. ఇమ్మానుయేల్ వ్యాఖ్యానించారు. మాటల్లో ఆప్యాయత కనిపించినా, ఆచరణలో మాత్రం స్వార్థం పెరుగుతోందన్నారు. ఒకరంటే ఒకరికి పడని పరిస్థితులు కుటుంబాల నుంచి సమాజం వరకు విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. “ఆహా.. భ్రమల్లో కొందరు, భయంలో ఇంకొందరు, ఆకలితో కొందరు, అనారోగ్యంతో కొందరు, ధనంతో కొందరు, దరిద్రంతో మరికొందరు.. దర్జాగా కొందరు, దీనంగా మరికొందరు.. వ్యసనాల్లో కొందరు, విషయాన్ని తెలుసుకోకుండా కొందరు.. మట్టిలో కొందరు, మాణిక్యాలతో మరికొందరు జీవిస్తున్నారు” అని డా. ఇమ్మానుయేల్ సమాజంలోని భిన్నమైన జీవన పరిస్థితులను వివరించారు. ఒకవైపు అపారమైన సంపద, సౌకర్యాలతో జీవిస్తున్న వారు ఉంటే మరోవైపు కనీస అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్న వారు ఉన్నారని అన్నారు. కొందరు భవిష్యత్తుపై భయంతో జీవిస్తుంటే, మరికొందరు భ్రమల్లో కాలం గడుపుతున్నారని తెలిపారు. ఈ అసమానతల మధ్య మనిషి తన మానవత్వాన్ని మాత్రం కోల్పోకూడదని సూచించారు. సమాజంలో సమస్యలు ఎన్నో ఉన్నప్పటికీ వాటికి పరిష్కారం కేవలం ప్రభుత్వాలు, చట్టాలు, వ్యవస్థలతోనే సాధ్యం కాదని, ప్రతి వ్యక్తిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని డా. మేడపాటి ఇమ్మానుయేల్ స్పష్టం చేశారు. కుటుంబంలో ప్రేమ, సమాజంలో సహకారం, బంధుత్వాల్లో ఆప్యాయత, పరస్పరం గౌరవించుకునే మనస్తత్వం పెంపొందించుకోవాలని సూచించారు. నిస్వార్థం, మానవత్వం, ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, బాధ్యతాయుతమైన ప్రవర్తనే సమాజంలోని అనేక సమస్యలకు పరిష్కార మార్గాలని ఆయన అన్నారు. ఆధునిక సాంకేతికతను స్వీకరిస్తూనే మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ విలువలు, మానవ సంబంధాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. “మనిషి ఎంత సంపాదించాడు అన్నదానికంటే.. ఎంతమందికి అండగా నిలిచాడు, ఎంతమందికి ఉపయోగపడ్డాడు, ఎంత మానవత్వంతో జీవించాడు అన్నదే అసలైన విజయానికి కొలమానం” అనే సందేశంతో డా. మేడపాటి ఇమ్మానుయేల్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

# ఉపాధ్యాయుడు శిక్షకుడు కాదు.. శ్రేయోభిలాషి!

**విద్యార్థి భవిష్యత్తుకు మార్గదర్శి.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడిదే కీలక పాత్ర**

**అనిల్ కాందారి స్టేట్ క్రైమ్ బ్యూరో అండ్ ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ మీడియా కో-ఆర్డినేటర్, హనుమకొండ**

**హన్మకొండ, 21 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడి పాత్ర అత్యంత కీలకమని, ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాకుండా విద్యార్థి భవిష్యత్తుకు మార్గదర్శి, శ్రేయోభిలాషి, సమాజ నిర్మాత అని స్టేట్ క్రైమ్ బ్యూరో అండ్ ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ మీడియా కో-ఆర్డినేటర్ అనిల్ కాందారి అన్నారు. విద్యార్థుల్లో పుస్తక జ్ఞానంతో పాటు క్రమశిక్షణ, బాధ్యత, మానవత్వం, నైతిక విలువలు, సామాజిక స్పృహను పెంపొందించడంలో ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. విద్యార్థి జీవితంలో ఎదురయ్యే ప్రతి తప్పును కేవలం శిక్షతో కాకుండా అవగాహన, సూచన, ప్రేమ, మార్గదర్శకత్వంతో సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. క్రమశిక్షణ పేరుతో విద్యార్థులను భయపెట్టడం, అవమానించడం లేదా శారీరకంగా హింసించడం సరైన పద్ధతి కాదని, విద్యార్థి చేసిన తప్పుకు కారణాన్ని అర్థం చేసుకుని, అదే తప్పు మళ్లీ పునరావృతం కాకుండా మంచి మార్గంలో నడిపించడమే నిజమైన ఉపాధ్యాయ ధర్మమని తెలిపారు. ఉపాధ్యాయుడు విద్యార్థి తప్పును సరిదిద్దినప్పుడు దానిని వ్యక్తిగత వ్యతిరేకతగా భావించకూడదని, విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇచ్చే సూచనగా స్వీకరించాలని అనిల్ కాందారి అన్నారు. అదే సమయంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల పట్ల ఓర్పు, ప్రేమ, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒకే విధంగా ఉండదని, వారి సామర్థ్యం, ఆసక్తులు, కుటుంబ పరిస్థితులు, ఆలోచనా విధానం భిన్నంగా ఉంటాయని, అందుకు అనుగుణంగా విద్యార్థులను అర్థం చేసుకుని ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఒక విద్యార్థి విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు ఉపాధ్యాయుడి కృషి, మార్గదర్శకత్వం, నిరంతర ప్రోత్సాహం ఎంతో దోహదపడతాయని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థిని ముందుకు తీసుకురావడం, ప్రతిభ కలిగిన విద్యార్థిని మరింత ప్రోత్సహించడం, ఆత్మవిశ్వాసం కోల్పోయిన విద్యార్థికి ధైర్యం చెప్పడం వంటి అనేక రూపాల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థి భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని అన్నారు. పిల్లల చదువు, ప్రవర్తన, ప్రతిభ, సమస్యలపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు చర్చించాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు పరస్పరం నిందించుకోవడం కాకుండా విద్యార్థి భవిష్యత్తే ప్రధాన లక్ష్యంగా కలిసి పరిష్కారం కనుగొనాలని కోరారు. విద్య అంటే కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడం మాత్రమే కాదని అనిల్ కాందారి అన్నారు. మంచి వ్యక్తిత్వం, మానవత్వం, సామాజిక బాధ్యత, ఇతరుల పట్ల గౌరవం, క్రమశిక్షణ, దేశం పట్ల బాధ్యత వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే అసలైన విద్య లక్ష్యమని తెలిపారు. విద్యార్థి ఎంత పెద్ద ఉద్యోగం సాధించాడన్నదే కాకుండా, సమాజానికి ఎంత ఉపయోగపడుతున్నాడు, ఇతరుల పట్ల ఎలా ప్రవర్తిస్తున్నాడు, తన బాధ్యతలను ఎంతవరకు నిర్వర్తిస్తున్నాడనేదే ముఖ్యమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించడం అంటే వారి వృత్తిని మాత్రమే గౌరవించడం కాదని, విద్యను, జ్ఞానాన్ని, భావితరాల భవిష్యత్తును గౌరవించడమేనని అన్నారు. ఉపాధ్యాయులకు సమాజం గౌరవం, సహకారం అందించాలని, అదే సమయంలో విద్యార్థుల హక్కులు, గౌరవం, భద్రతను కాపాడుతూ సానుకూలమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు--విద్యార్థుల మధ్య భయం కాకుండా విశ్వాసం, ఒత్తిడి కాకుండా ప్రోత్సాహం, దూరం కాకుండా ఆత్మీయత ఉండేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి దానికి సరైన దిశను చూపించగలిగిన వ్యక్తి ఉపాధ్యాయుడని, అందుకే ఉపాధ్యాయుడిని కేవలం శిక్షకుడిగా కాకుండా శ్రేయోభిలాషిగా చూడాలని అనిల్ కాందారి అన్నారు. ఒక ఉపాధ్యాయుడు చెప్పే మంచి మాట విద్యార్థి జీవితానికి మార్గదర్శకంగా మారుతుందని, ఒక ప్రోత్సాహం విద్యార్థిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, ఒక మంచి సూచన అతని భవిష్యత్తును మార్చగలదని పేర్కొన్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయుల సేవలను స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. అయితే ఉపాధ్యాయుల పట్ల గౌరవం ఒక్కరోజుకే పరిమితం కాకుండా ప్రతి రోజూ వారి సేవలను గుర్తించే సంస్కృతి సమాజంలో పెరగాలని ఆకాంక్షించారు. “ఉపాధ్యాయుడు శిక్షకుడు మాత్రమే కాదు.. శ్రేయోభిలాషి. పాఠాలు చెప్పేవాడు మాత్రమే కాదు.. జీవితాన్ని నేర్పేవాడు. విద్యార్థులను పరీక్షలకు మాత్రమే సిద్ధం చేసేవాడు కాదు.. జీవితాన్ని ఎదుర్కొనేలా తీర్చిదిద్దేవాడు. ఉపాధ్యాయులను గౌరవిద్దాం.. వారి త్యాగాన్ని గుర్తిద్దాం.. విద్యకు విలువ ఇద్దాం.. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలుద్దాం.. భావితరాల సమాజాన్ని నిర్మిద్దాం” అని అనిల్ కాందారి పిలుపునిచ్చారు.

# శ్రీశైలంలో వైభవంగా వరలక్ష్మీవ్రతాలు

**భారీగా తరలివచ్చిన భక్తులు**

**శ్రీశైలం,ఆగస్ట్21(జై భీమ్ న్యూస్) :**

శ్రీశైలం మహా క్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరిగాయి. రెండో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆలయానికి ఉత్తర భాగంలోని చంద్రావతి కల్యాణ మండపంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను జరిపారు. వేదికపై వరలక్ష్మీదేవి, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి ఉభయ దేవాలయాల అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్రతాల్లో 1500 మంది మహిళలు పాల్గొని వ్రతాలు నిర్వహించారు. ప్రతి భక్తురాలికి విడివిడిగా కలశాలు ఏర్పాటు చేయించి, శాస్త్రోక్తంగా వ్రతాలను జరిపించారు. వ్రతాల్లో పాల్గొన్న మహిళలకు శేష వస్త్రాలుగా చీర, రవిక, గాజులు, ప్రసాదాలను ఆలయ ఈవో శ్రీనివాసరావు అందజేశారు. వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# పెల్లెట్ గన్ బాధితుడికి న్యాయం చేయాలి





### నిరసనకు దిగిన రాహుల గాంధీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

పెల్లెట్ గన్ బాధితుడికి న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నిరసనకు దిగారు. ఢిల్లీలోని పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు తెరతీశారు. సంసద్ యాత్ర సందర్భంగా పెల్లెట్ గన్ ప్రయోగంతో తనకు గాయాలయ్యాయని సాహిల్ లోచాబ్ అనే యువకుడు ఆరోపించాడు. ఈ విషయమై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తాను ఎన్ని సార్లు కోరినా పోలీసులు లక్ష్యపెట్టడం లేదని ఆరోపించాడు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ నేడు సాహిల్ లోచాబ్‌ను వెంట తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తొలుత రాహుల్ గాంధీ కాన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, న్యూఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ పార్లమెంటు స్ట్రీట్ పీఎస్‌లో ఉన్నారని తెలియడంతో అక్కడకు వెళ్లారు. పె÷-లలెట్ గన్‌తో దాడి ఘటనపై దర్యాప్తు ఎంత వరకూ వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీ రాహుల్ గాంధీ అకస్మాత్తుగా రావడంతో పోలీసులు ఒకింత ఆశ్చర్యపోయారు. అయితే, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు మాత్రం వారు తిరస్కరించారు. దీంతో, పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. సంసద్ ఛలో యాత్ర సందర్భంగా పార్లమెంటుకు సమీపంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌తో కాల్పులు జరిపారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే, ఢిల్లీ పోలీసులు మాత్రం ఈ ఆరోపణలు తోసిపుచ్చారు. సీఆర్‌పీఎఫ్ కూడా ఇప్పటివరకూ స్పందించలేదు.

# షావుకారు జనకి మృతికి ప్రముఖుల సంతాపం

### చిరంజీవి, ఎన్టీఆర్, విజయ్‌ల సంతాపప్రకటన



**చెన్నై,ఆగస్ట్21(జై భీమ్ న్యూస్):**

ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా షావుకారు జానకికి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. షావుకారు జానకి మరణంపై మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ' ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి ఇకలేరనే వార్త ఎంతో బాధ కలిగించింది. 'షావుకారు' చిత్రంతో మొదలైన ఆమె సుదీర్ఘ సినీ ప్రస్థానం తెలుగు, తమిళంతో పాటు పలు భాషల్లో దాదాపు ఏడు దశాబ్దాలపాటు కొనసాగింది. వైవిధ్యమైన పాత్రలకు తన సహజమైన నటనతో ప్రాణం పోసి, ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప నటి ఆమె. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'తెలుగు, భారతీయ సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన షావుకారు జానకి మరణవార్త ఎంతో బాధ కలిగించింది. జానకి సినీ ప్రయాణం, ఆమె పోషించిన పాత్రలు ఎప్పటికీ మన జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి' అని పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ స్పందిస్తూ.. 'తన అద్వితీయమైన నటనతో ఎన్నో తరాల ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి అనారోగ్యంతో కన్నుమూశారనే వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి, వేదనకు గురిచేసింది. చిత్ర పరిశ్రమలో 70 ఏళ్లకు పైగా ప్రయాణించి, లెక్కలేనన్ని పాత్రలకు జీవం పోసిన ఆమె కళా సేవ ఎల్లప్పుడూ కొనియాడదగినది. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ వంటి వివిధ భాషా చిత్రాలలో నటించి రికార్డు సృష్టించడంతో పాటు.. పద్మశ్రీ, కలైమామణి, నంది అవార్డులతో సహా పలు పురస్కారాలను అందుకున్న షావుకారు జానకి మరణం సినీ రంగానికి తీరని లోటు' అని అన్నారు. మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు స్పందిస్తూ.. 'లెజెండరీ నటి షావుకారు జానకి మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆమె హుందాతనం, గౌరవం, అద్భుతమైన నటనా ప్రస్థానం తరతరాలకూ నిలిచి ఉంటాయి. నేటి యువత ఆమె ఎంతటి గొప్ప మహోన్నతమైన వ్యక్తో తప్పకుండా తెలుసుకోవాలి. ఆమె కుటుంబసభ్యులకు నా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి' అని రాసుకొచ్చారు.

# అన్నవరం బస్టాండ్‌లో మంత్రి మండిపల్లి ఆకస్మిక తనిఖీ



**కాకినాడ,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మహిళా ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. స్త్రీ శక్తి పథకం అమలుపై మహిళా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతోందని మహిళలు ప్రశంసలు కురిపించారు. అన్నవరం బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న మౌలిక సదుపాయాలపైనా మంత్రి ఆరా తీశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు. అనంతరం అన్నవరం ఆర్టీసీ క్యాంటీన్‌ను సందర్శించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో కలిసి అల్పాహారం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయంగా మాట్లాడిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు

### సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

**హైదరాబాద్,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు నడుస్తోంది అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. ఇటీవల కాలంగా తెలంగాణ కాంగ్రెస్ నేతల అంతర్గత కలహాల వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటుం దన్నారు. రేవంత్ రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, ఏ తప్పూ చేయకుండా ఉంటేనే మంత్రులు, కిందిస్థాయి అధికారుల్లో భయం ఉంటుంది. ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి పాలనపై దృష్టిపెట్టాలని పరోక్షంగా సూచించారు. 22ఏ భూముల నిబంధనను కొందరు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామి కాదు, ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని పేర్కొన్నారు. తమ సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని అసహనం వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తిపెరుగుతుందన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థులకు అండగా ఉంటాం: జగదీశ్ రెడ్డి

**సూర్యాపేట,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేస్తున్న అన్యాయంపై పోరాడాలని విద్యార్థులు సూచించారు.ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి పాలిటెక్నిక్ విద్యార్థులకు అన్యాయం జరిగే విధంగా తీసుకున్న శక్తి స్కీం నిర్ణయాలను వెంటనే ఉపసంహరించు కోవాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు తమ పక్షాన పోరాడి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని మాజీ మంత్రిని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన జగదీష్‌రెడ్డి విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# నేడు కేరళకు పవన్ కళ్యాణ్

### ఆయుర్వేద థెరఫీ చేయించుకోన్న డిప్యూటి సిఎం

**అమరావతి,ఆగస్ట్21(జై భీమ్ న్యూస్):**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. శనివారం కేరళకు వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజానికి రొటేటర్ కఫ్ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆయన.. వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సలో భాగంగా కేరళలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు పవన్ కల్యాణ్‌కు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కొంతకాలం బహిరంగ కార్యక్రమాలకు, అధికారిక విధులకు దూరంగా ఉండాలని కూడా వైద్యులు సూచించినట్లు జనసేన కేంద్ర కార్యాలయం తెలిపింది. అయితే పాలనా బాధ్యతల నేపథ్యంలో ఆయన వారం రోజుల్లోనే క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు. ఆ తర్వాత ముందుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు వరుసగా శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో శస్త్రచికిత్స చేసిన కుడి భుజం ప్రాంతంలో వాపు పెరగడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు భుజం పూర్తిస్థాయిలో కోలుకునేలా చికిత్స తీసుకోవాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే కేరళలోని ఆయుర్వేద వైద్యాలయంలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స, విశ్రాంతికి ప్రాధాన్యత ఇస్తూనే తన పాలనా బాధ్యతలను కొనసాగించేందుకు పవన్ కల్యాణ్ ప్రయత్నిస్తున్నట్లు జనసేన కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

# ప్రయాణికులకు ఆర్టీసీ ఆఫర్

### రిటర్న్ టిక్కెట్ బుకింగ్‌పై పదిశాతం రాయితీ

**హైదరాబాద్,ఆగస్ట్21(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు ముందస్తు రిజర్వేషన్‌ను ప్రోత్సహించేందుకు ఒక ప్రత్యేకమైన ఆఫర్‌ను అందుబాటు లోకి తెచ్చింది. ప్రయాణికులు తమ రాకపోకల టికెట్లను ఒకేసారి బుక్ చేసుకోవడం ద్వారా తిరుగు ప్రయాణం టికెట్‌పై 10 శాతం తగ్గింపును పొందవచ్చు. దూరప్రాంతాలకు ప్రయాణించే వారికి, అలాగే వారాంతాల్లో కుటుంబంతో కలిసే వెళ్లేవారికి ఈ ఆఫర్ ఎంతో ప్రయోజనకరంగా మారింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు , ప్రయాణికులను ఆకట్టుకునేందుకు సంస్థ ఈ ప్రత్యేక పథకాన్ని డిజైన్ చేసింది. ఈ ఆఫర్‌ను పొందడానికి ప్రయాణికులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా మొబైల్ యాప్ ఉపయోగించి ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకోవలసి ఉంటుంది. వెళ్లేందుకు, తిరిగి రావడానికి ఒకేసారి టికెట్లను రిజర్వ్ చేసినప్పుడు మాత్రమే వర్తించే ఈ ఆఫర్ ద్వారా ప్రయాణికులు తమ ప్రయాణ ఖర్చులపై మంచి ఆదా చేసుకోవచ్చు. ప్రయాణ తేదీలను ముందుగానే ఎ÷-లాన్ చేసుకునే వారికి సీట్ల లభ్యత సమస్య లేకుండా, తక్కువ ధరలోనే టికెట్ దొరికే సౌకర్యం కలగడమే కాకుండా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునే వీలు కలుగుతుంది. టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన సందేహాల నివారణకు లేదా సమాచారం కోసం సంస్థ హెల్ప్‌లైన్ నంబర్లు 040-69440000, 040-23450033 లను కూడా అందుబాటులో ఉంచింది. ప్రైవేట్ వాహన ప్రయాణాల కన్నా భద్రత, సౌకర్యం అధికంగా ఉండే ఆర్టీసీ బస్సుల సేవలను వినియోగించుకోవాలని సంస్థ కోరుతోంది. రాబోయే పండుగలు, సెలవుల సీజన్‌లో ప్రయాణించే వారు చివరి నిమిషంలో ఇబ్బందులు పడకుండా ఈ ముందస్తు బుకింగ్ 10 శాతం డిస్కౌంట్ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవచ్చు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను మరింత మందికి అందుబాటులోకి తీసుకురావడానికి ఆర్టీసీ తీసుకుంటున్న ఈ చర్యకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.



# మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు

## గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతుంది: అచ్చన్న

**అమరావతి,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఓడలరేవు నుంచి 'ముత్యాలమ్మ' బోటులో ఆగస్టు 3న చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన సంగతి తెలిసిందే. ఒడిశాలోని పారాదీప్ తీరం వద్ద ఒక పసుపు రంగు బోటును అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై తాజాగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చే వరకు అన్ని మార్గాల్లోనూ సెర్చ్ ఆపరేషన్ ఆపే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ గాలింపు చర్యల కోసం ఏకంగా 5 నౌకలు, 2 డోర్నియర్ విమానాలు, ఒక ప్రత్యేక హెలికాప్టర్‌ను రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గల్లంతైన బోటు వివరాలను మయన్మార్, పోర్ట్÷-లబెయిర్, బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డ్ అధికారులకు కూడా పంపించామని, సరిహద్దు తీరప్రాంతాల్లోనూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కేంద్ర కోస్ట్‌గార్డ్, నేవీ అధికారులతో ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తోందని తెలిపారు. ఈ నెల 24 తర్వాత కొత్త అధికారి బాధ్యతలు చేపట్టినప్పటికీ గాలింపు చర్యలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతాయని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం వారి రక్షణకు అన్ని విధాలుగా కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా కల్పించారు.

జై భీమ్ POWER OF PEOPLE

# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీభోర్సే

## వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్



టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' చిత్రంలోనూ భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించింది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ సరసన కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'సేయోన్' సినిమాలో నటిస్తోంది.

# ఇరుముడి ఎమోషనల్ డ్రామా




రవితేజ హీరోగా 'ఇరుముడి' అనే టైటిల్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఇందులోని పాటలు, ట్రైలర్‌లో చూపించిన ఫ్యామిలీ ఎమోషన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. కచ్చితంగా రవితేజకి ఇది కమ్‌బ్యాక్ సినిమా అవుతుందని అందరూ భావించారు. పీలేరు ప్రాంతంలో త్రినాథ్(రవితేజ) ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేస్తూ కూతురు మణెమ్మ(నక్షత్ర), భార్య కావేరి(ప్రియా భవానీ శంకర్)తో ఆనందంగా జీవిస్తుంటాడు. ఆ ప్రాంతంలో అందరి ఆడపిల్లలని తన కూతురులానే చూస్తుంటాడు. తనకు మద్యం అలవాటు ఉంటుంది. కాకపోతే అయ్యప్ప స్వామి మాలలో ఉన్నప్పుడు మాత్రం మందు జోలికి వెళ్లడు. అదే ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా చనిపోతుంది. ఆ మరణం వెనుక ఉన్నది ఎవరు? ఈ చావు త్రినాథ్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసిందనేది మిగతా కథ. తెలుగులో చాలా క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చాయి. కాకపోతే కుటుంబ, అయ్యప్ప మాల నేపథ్యంలో ఒక ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'ఇరుముడి' ప్రత్యేకంగా కనిపిస్తుంది. సినిమా కథ ప్రారంభం ఓ స్కూల్లో టీచర్ సస్పెండ్ అవడంతో మొదలవుతుంది. ఆ తర్వాత కుటుంబం, మణెమ్మతో ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఎస్టాబ్లిష్ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఎప్పుడైతే పదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి అనూహ్యంగా చనిపోతుందో, అక్కడి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. అది విరామానికి వచ్చేసరికి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, ఎమోషన్ కలిగిస్తుంది. ఈ కథను దర్శకుడు హ్యాండిల్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. కథలో మంచి ట్విస్టులు రాసుకున్నారు. ఒక హార్ట్ టచింగ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా కథను దర్శకుడు శివ నిర్వాణ నడిపించారు. అదే సమయంలో ఒక బలమైన సందేశం కూడా ఇచ్చారు. ఆ సందేశం కచ్చితంగా గుర్తుపెట్టుకుని పాటించదగ్గదిగా ఉంటుంది. రవితేజ తన మాస్ ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తిగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో నటించారు. త్రినాథ్ పాత్రలో ఆయన పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఒకవైపు ఎమోషనల్ తండ్రిగా, మరోవైపు మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప మాల వేసుకున్న భక్తుడిగా, చివర్లో ఒక తండ్రిగా.. తన పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి. ఆ వేరియేషన్స్ అన్నింటినీ రవితేజ చాలా పరిణతితో కనబరిచారు. అలాగే మణెమ్మ పాత్రలో చేసిన బేబీ నక్షత్ర పాత్ర కూడా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. రవితేజ భార్య పాత్రలో కనిపించిన ప్రియా భవానీ శంకర్ పోషించిన కావేరి పాత్ర కూడా చాలా హుందాగా ఉంటుంది. ఆ పాత్ర ఈ సినిమాకు కావాల్సిన ఎమోషన్‌ను యాడ్ చేసింది. గురుస్వామి పాత్రలో చేసిన సాయికుమార్ పాత్ర ఆయనకు చాలా కొత్తగా, అదే సమయంలో ప్రభావవంతంగా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఆ పాత్రకు దర్శకుడు రాసుకున్న ఒక మలుపు కూడా కథకు బలాన్ని చేకూర్చింది. అలాగే అజయ్ ఘోష్ పాత్ర కూడా కావాల్సిన క్యూరియాసిటీని పెంచింది. మిగతా నటీనటులు పరిధి మేరకు కనిపించారు. సీలేరు ప్రాంతంలో తీసిన చిత్రమిది. అన్ని ఒరిజినల్ లొకేషన్స్ కావడంతో కథ నిజంగా అక్కడే జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.

# వందకోట్ల క్లబ్బులోకి డిసి మూవీ

టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.




# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల



లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విఘ్ణ ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.